1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | మార్చి 06, 2025 | www.navatelangana.com

## కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామానికి చెందిన పందిరి శ్రీకాంత్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి బుధవారం పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే తలమడుగు మండలం భరంపూర్ గ్రామానికి చెందిన చంద్రకాంత్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండడంతో అతడిని పరామర్శించారు. ఆయన వెంట మెస్రం భాస్కర్, సాయిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.



## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని తుమ్మల్‌పాడ్ గ్రామానికి చెందిన ఇంగోలే విలాస్(24) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇంట్లో నూతనంగా ఫ్లోరింగ్ చేశాడు. దానికి క్యూరింగ్ చేస్తుండగా విద్యుత్ తీగలను కొంచెం పక్కకు జరిపాడు. ఎక్కడో వైర్ తెగి ఉండడంతో షాక్ తగిలింది. కుటుంబీకులు అంబులెన్స్‌కు సమాచారం అందజేసి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. యువకుడు దుబాయ్ వెళ్లి ఇటీవలే వచ్చాడు. వచ్చిన రెండు నెలల్లోనే విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.



## మలేషియా జైలులో ఉన్న మండల వాసుల విడుదలకు కృషి



నవతెలంగాణ-కడెం

ఉపాధి నిమిత్తం గత సంవత్సరం మండలంలోని లింగాపూర్, దస్తురాబాద్, మున్యాల్ గ్రామాలకు చెందిన ఆరుగురు మలేషియాకు వెళ్లగా అకారణంగా జైల్లో ఉంటున్నారు. కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌ను కలిసి వివరాలు తెలియజేసి విడుదలకు సహకరించాలని కోరారు. జైలులో ఉన్న వారిని విడుదల చేసేందుకు ఆయన హామీ ఇచ్చారు. మలేషియాలో జైల్లో ఉన్న రాచకొండ నరేష్, తలారి భాస్కర్, గురుజాల శంకర్, గురిజాల రాజేశ్వర్, గుండా శ్రీనివాస్, యమునూరి రవీందర్‌ను విడుదల చేయడానికి భరోసా కల్పించారు.

## వాఘాపూర్‌లో ఉచిత మెడికల్ క్యాంపు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండలంలోని వాఘాపూర్ గ్రామంలో బుధవారం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించామని డాక్టర్ సర్ఫరాజ్ తెలిపారు. జ్వరం, దగ్గు, టీబీ, బిపి, షుగర్ వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్, డా. రోజారమణి, సబ్ సెంటర్ ఏఎన్ఎం సంగీత, టీబీ ఆరోగ్య పర్యవేక్షకులు రవీందర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

చాప కింద నీరులా విస్తరిస్తున్న సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై డి.సునీల్ అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరైన మొబైల్ ఫోన్‌కు మీరు లాటరీ గెలిచారని, మేము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ ఖాతా నెంబరు తెలపాలని ఆశలో పడేస్తారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఖాతా నెంబరు ఇతరులకు చెప్పకూడదన్నారు. విద్యార్థులకు ఫలానా కాలేజీ నుంచి ఫోన్ చేస్తున్నామని స్కాలర్‌షిప్ కోసం ఖాతా నెంబరు తెలపాలంటూ మోసపూరిత లింకుకులు, మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదన్నారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని కాంగ్రెస్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అన్నారు. బుధవారం మావల మండలంలోని వాఘాపూర్ ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టం అనుకోకుండా ఇష్టంగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు.

# తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

- కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆందోళన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలంటూ వాంకిడి మండలంలోని పాటగూడ గ్రామపంచాయతీ కొలాంగూడ గ్రామానికి చెందిన ప్రజలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కుమురం భీం చౌక్ నుండి ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొలాంగూడ గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో సుమారుగా 25 కుటుంబాలు 200మంది ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు. గ్రామంలో బోర్లు ఉన్నప్పటికీ అవి సరిగ్గా పనిచేయక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జిల్లా కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ దృష్టికి కూడా సమస్య తీసుకెళ్లారని, అయినప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో నిరసనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. ఓ వైపు ప్రభుత్వాలు ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తున్నామని ప్రకటించుకుంటున్నాయని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అధ్వానంగా ఉందని అన్నారు. బిందెడు నీటి కోసం అర్ధరాత్రి లేచి బోరింగ్ ఉపయోగించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. సమస్య పరిష్కారం కొరకు అధికారులు స్పందించే వరకు నిరసన విరమించేది లేదని భీష్మించుకు కూర్చుండడంతో కలెక్టరేట్ ఏవో మధుకర్, మిషన్ భగీరథ డీఈ ఇర్ఫాన్ అక్కడికి చేరుకొని సమస్య పరిష్కారం కోసం వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోరెంగ మాలశ్రీ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాజేందర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టీకానంద్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమాచారి, విటిడిఎ ఉపాధ్యక్షుడు సిడాం పగ్గు, కొలాం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం జలపతి, గ్రామ పటేల్ ధర్ము గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైటాయించిన ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న నాయకులు, గ్రామస్తులు

# ఎమ్మెల్యేగా, మంత్రిగా రామన్న జిల్లాకేం చేశారు..?

- జిల్లాకు ఎయిర్‌పోర్టు తీసుకోస్తాం
- అవగాహన లేకుండా మాట్లాడొద్దు
- ఎంపీ, ఎమ్మెల్యే గోడం నగేష్, పాయల్ శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ నాయకులు అవగాహన లేకుండా అసత్య ప్రచారం చేస్తున్నారని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఐదు సంవత్సరాలు మంత్రిగా ఉన్న జోగు రామన్న జిల్లా ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. ఇటీవల జోగు రామన్న చేసిన వ్యాఖ్యలను బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఖండించారు. జిల్లాలో ఎయిర్ ఫోర్స్ అకాడమీ కోసం 2014లో తాను ఎంపీగా ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న రామన్న ద్వారా అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని నగేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలో అకాడమీ ఏర్పాటుకు 2014లోనే 1592 ఎకరాలకు ప్రపోజల్స్ పంపించారని తెలిపారు. దాన్ని పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ దృష్టికి మంత్రిగా ఉన్న రామన్న ద్వారా తీసుకెళ్తే హైదరాబాద్‌లో రక్షణ శాఖ తమకు భూమి ఇవ్వడం లేదని, తాము ఎందుకు వెయ్యి ఎకరాలు ఇవ్వాలని చెప్పారని రామన్న తనతో చెప్పారన్న విషయాన్ని మరిచిపోయి మాట్లాడుతున్నారన్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలం ఇవ్వని కారణంగానే ఎయిర్ ఫోర్స్ అకాడమీ పెండింగ్‌లో ఉందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై సానుకూలంగా ఉందన్న సంకేతాలు వస్తున్నాయన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులతో పాటు ఆదిలాబాద్ ప్రజల చిరకాల వాంఛ అయిన ఆదిలాబాద్ టూ అర్మూర్ రైల్వేలైన్ సాధిస్తామన్నారు.

జిల్లాకు ఎయిర్‌పోర్ట్ తీసుకొస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి మంత్రిగా చేసిన జోగు రామన్న ఏం చేయకుండా తన సంవత్సరాల పదవీ కాలంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రేణుకా సిమెంట్ పరిశ్రమ ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు. కమీషన్ల కోసం పని చేశారే కాబట్టే పరిశ్రమలు రాలేదన్నారు. తనకు ఇంకా నాలుగు సంవత్సరాల కాలం ఉందని, అప్పటి వరకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని స్పష్టం చేశారు. అనుభవం ఉన్న వ్యక్తిగా జోగు రామన్న సలహాలు, సూచనలు ఇవ్వాలే తప్ప ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడడం సరికాదని హితవు పలికారు.

సీసీఐ ఫ్యాక్టరీ స్క్రాప్ కేవలం పనికిరాని వాటిని అమ్మడానికే టెండర్లు వేశారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, వేదవ్యాస్, రఘుపతి, లాలా మున్నా, ఆదినాథ్, నగేష్, కృష్ణ, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.



# ఇంటి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలి

- నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నవతెలంగాణ-నిర్మల్

ఇంటి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గృహ, వాణిజ్య పన్ను వసూలు, సానిటేషన్ ఇతర అంశాలపై మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. పట్టణ ప్రాంతాలలో వాణిజ్య, గృహ పన్నుల వసూలును వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సకాలంలో పన్నులు చెల్లించని వారికి చట్ట ప్రకారం రెడ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఇప్పటివరకు వసూలు చేసిన పన్నులు, బకాయిలకు సంబంధించి మున్సిపాలిటీల వారీగా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా త్వరితగతిన పన్ను వసూలు పూర్తి చేయాలన్నారు. పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారస్తులు తప్పనిసరిగా వాణిజ్య లైసెన్సులను పునరుద్ధరించుకునేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ భవన సముదయాలలో వ్యాపారం నిర్వహించుకుంటున్న వ్యాపారస్తుల నుంచి అద్దెలు వసూలు చేయాలన్నారు. బకాయిలు పేరుకుపోయిన దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. సానిటేషన్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. సమావేశంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, రాజేష్ కుమార్, జాదవ్‌కృష్ణ, మెప్మా పీడీ సుభాష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పేదలకు పైసా ఖర్చు లేకుండా శస్త్ర చికిత్సలు

- సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్
- క్యాన్సర్ సర్జరీలు విజయవంతం కావడం పట్ల ప్రశంసలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లక్షలు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా పేదలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు తమవంతుగా కృషి చేస్తున్నామని, తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నామని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో పలు విభాగాల ఆధ్వర్యంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని, ప్రజల నమ్మకాన్ని మరింత చేరుకునేలా యువ వైద్య నిపుణులు నిబద్ధతతో పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నలుగురు క్యాన్సర్ రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించగా విజయవంతం కావడంతో వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా బుధవారం ఆస్పత్రిలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పొచ్చక్క, నాందేవ్, ఆశన్న, మీనాక్షి అనే నలుగురు క్యాన్సర్ పేషంట్లు ఆస్పత్రిలో చేరగా వారికి యువ వైద్య బృందం విజయవంతంగా సర్జరీలు చేసిందని తెలిపారు. ప్రస్తుతం వారంతా ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఇదే శస్త్రచికిత్సలు బయట ప్రయివేటు ఆస్పత్రిలో చేసుకోవాలంటే లక్షల రూపాయలు ఖర్చయ్యేదని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోనే తొలిసారిగా ఈ సర్జరీ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు దాదాపు 400 కేసులను టేకాప్ చేసి యువ వైద్యులు సక్సెస్‌ఫుల్‌గా ఆపరేషన్లు పూర్తి చేశారన్నారు. వారి సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పేదల కోసం భవిష్యత్తులో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం వైద్యులను రోగి కుటుంబీకులు సన్మానించారు. ఈ సమావేశంలో న్యూరో సర్జన్ విజయ్ మోహన్, జక్కుల శ్రీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ అక్క పేరుతో విద్యార్థులకు అండ : ఎస్పీ జానకి షర్మిల



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలో మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ అక్క పేరుతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ 18 మంది మహిళా అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగం పోలీస్ అక్క పేరుతో అడుగులు వేస్తున్నామని, ఒక సరికొత్త ఆలోచనతో కేవలం ఆడపిల్లల సమస్యలను దగ్గరుండి అర్థం చేసుకుంటారనే ఉద్దేశంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని 18 పాఠశాలలకు 18 మంది మహిళా కానిస్టేబుళ్లను సంధానకర్తలుగా నియమిస్తున్నామన్నారు. ఒక్కో పాఠశాలను ఒక్కో మహిళ కానిస్టేబుల్ దత్తత తీసుకునే విధంగా చేశామని తెలిపారు. ఎప్పటికపుడు తన స్వీయ పర్యవేక్షణలో జూమ్ మాధ్యమం ద్వారా సమావేశాలను ఏర్పాటు చేసి మహిళా అధికారులకు శిక్షణ ఇచ్చి అక్కడున్న సమస్యలను ఎలా అధిగమించాలో అధ్యయనం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి నెలలో ఒక రోజు ఉమెన్ పీసీలతో ప్రభుత్వ బాలికల విద్యాసంస్థల సందర్శన, హాస్టల్స్‌లో రాత్రి బస చేస్తారన్నారు. విద్యార్థినుల స్థితిగతులు, సైబర్ క్రైమ్, బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌తో పాటు భద్రతపై సమీక్ష, విద్యార్థినులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనా పాల్గొన్నారు.

## టిమ్ మిషన్ ఆగిపోవడంతో ప్రయాణికులకు కష్టాలు



నవతెలంగాణ-తలమడుగు

టిమ్ మిషన్‌లో చార్జింగ్ అయిపోయి పని చేయకపోవడంతో సదరు బస్సు కండక్టర్ టికెట్ ఇవ్వలేక ప్రయాణికులను కిందికి దింపేసిన ఘటన బుధవారం జరిగింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం..కోసాయి నుండి ఆర్టీసీ బస్సు ఆదిలాబాద్ వైపు వస్తోంది. కొత్తూరు గ్రామంలో దాదాపు పది మంది ప్రయాణికులు ఎక్కారు. మార్గమధ్యలో టిమ్ మిషన్ పనిచేయకపోవడంతో టికెట్ ఇచ్చే పరిస్థితి లేక ప్రయాణికులను కిందికి దింపేశారు. దీంతో చంటి పిల్లల తల్లులు ఇబ్బందులు పడ్డారు. సుంకిడి గ్రామంలో 30 నిమిషాల వరకు బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సదరు కండక్టర్ టిమ్ మిషన్ చార్జింగ్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ చార్జింగ్ వైరు దొరకకపోవడంతో అప్పటికే టికెట్లు ఇచ్చిన ప్రయాణికులతో బస్సు జిల్లా కేంద్రానికి బయలుదేరింది. ఈ విషయమై డీఎంను వివరణ కోరగా దురుసుగా సమాధానం ఇచ్చారు. సమస్యలు వస్తుంటాయని, వాటిని పెద్దగా చూపించడం సరికాదని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మిషన్లు ఎప్పుడు ఆగిపోతాయో ఎవరికి తెలుసునని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | మార్చి 06, 2025 | www.navatelangana.com



## తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు

నవతెలంగాణ-కుభీర్



వేసవి కాలంలో గ్రామంలో నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ సుదర్శన్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శిలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో ఉన్న మురుగు కాలువలు, వీధి దీపాలతో పాటు వేసవి కాలంలో దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ఉన్న ప్రజలకు నీటి సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిలకు సూచించారు. అదే విధంగా ప్రతి గ్రామ పంచాయతీలో 100 శాతం ఇంటి పన్నులు వసూళుచేసేలా చూడాలన్నారు. సానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు పరిశీలించి గ్రామంలో చెత్త సేకరణ డంపింగ్ యార్డ్, నర్సరీలో పెరుగుతున్న మొక్కలకు నీళ్ల పట్టేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి మోహన్ సింగ్ ఉన్నారు.

## అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని చింతగూడ గ్రామంలో పంద్రజైవంత్ రావు రైతుకు చెందిన ఇల్లు ప్రమాదవశతు అగ్ని ప్రమాదంలో బుధవారం కాలిపోయింది. ఇంట్లోని వస్తువులతో పాటు నిల్వ ఉంచిన రెండు క్వింటాళ్ల పత్తి సైతం బూడిదైంది. రూ.60 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్ రావు తెలిపారు. రైతు కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యా నిచ్చారు. ప్రభుత్వం వెంటనే రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

# తొలిరోజు ప్రశాంతం..660మంది గైర్హాజరు

• గంట ముందే చేరుకున్న విద్యార్థులు • క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపించి



ఆదిలాబాద్ : పరీక్ష కేంద్రంలో ప్రశ్న పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఇంటర్ వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 18880 మంది విద్యార్థుల కోసం 31 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి పరీక్ష ప్రారంభం కాగా.. గంట ముందు నుంచే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోనికి అనుమతించారు. కాగా పట్టణంలోని ఆయా పరీక్ష కేంద్రాలను డీఐఈఓ జాధవ్ గణేష్ కుమార్ పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లాలో 18880 మొత్తం విద్యార్థులు ఉండగా ఇందులో 9814 మంది విద్యార్థులు హాజరు కాగా 9154 మంది హాజరై 660 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ బోర్డు అధికారి జాధవ్ గణేష్ తెలిపారు. ఇందులో జనరల్ విద్యార్థులు 8756 మంది ఉండగా 8240 మంది హాజరు కాగా 516 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ లో 1058 మంది విద్యార్థులు ఉండగా 914 మందిహాజరు కాగా 144 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రతి కేంద్రంలో తాగు నీటితో పాటు వైద్య సిబ్బందిని నియమించామన్నారు. మాస్ కాపియింగ్ కు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కాగా తొలిరోజే లాంగ్వేజ్ పరీక్ష తెలుగు, హిందీ, సంస్కృత్, ఉర్దూ, అరబిక్కు 660 మంది విద్యార్థులు గైర్హాజరవడం గమనార్హం.

**పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఆదిలాబాద్ కలెక్టర్**

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుండి ప్రారంభమైన సందర్భంగా పట్టణంలోని.పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రాజర్షి షా సందర్శించారు. ప్రభుత్వజూనియర్ బాలికల కళాశాల, విద్యార్థి కళాశాల కేంద్రాలను సందర్శించి పరిశీలించి, విద్యార్థుల హాజరు, సిసి కెమెరా, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నిరంతరం విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు పాటించాలి సూచించారు. కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ అధికారి గణేష్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

**నిర్మల్** : జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ప్రభుత్వ బాల, బాలికల జూనియర్ కళాశాలల్లోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ అభిలాష అభినవ్ తొలిరోజు బుధవారం పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీసీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా..? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏఎన్ఎం, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరశురాం, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

**434 మంది విద్యార్థులు గైర్హాజరు**

**నిర్మల్‌టౌన్** : జిల్లావ్యాప్తంగా బుధవారం ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 434 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ జాదవ్ పరశు రాం తెలిపారు. జనరల్ 6323 మందికి గాను 5971, ఒకేషనల్ కోర్సులలో 621 గాను 539 విద్యార్థులు హాజరయ్యారని, మొత్తం 6944 మంది విద్యార్థులకు గాను 6510 విద్యార్థులు పరీక్ష రాశారని తెలిపారు.



**ఇంద్రవెల్లి** : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష బుధవారం సజావుగా సాగింది. మండలంలో ప్రభుత్వ జూనియర్, క్రిసియెంట్ కేంద్రాలను ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తనిఖీ చేశారు. విద్యార్థులు ఎలాంటి మాస్ కాపింగ్‌కు పాల్పడకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో మొత్తం 277 విద్యార్థుల్లో 23 మంది గైర్హాజరయ్యారు. ప్రయివేటు క్రిసియెంట్ జూనియర్ కళాశాలలో మొత్తం 170 మందికి ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.



నిర్మల్ : పరీక్ష కొనసాగుతున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ : ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యచరణను అవలంబించనున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. బుధవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి వివిధ రకాల చర్యలను చేపడుతూ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదలు జరుగుతున్న ప్రాంతాలను హాట్‌స్పాట్‌లను గుర్తించి ఆ ప్రదేశాలలో సూచిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్ లాంటివి ఏర్పాటు చేయాలని, స్పీడ్ లేజర్ గన్‌ను వినియోగిస్తూ ఎక్కువగా వేగంగా నడుపు వాహనాలపై చర్యలను తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువ శాతం ద్విచక్రవాహనాలుండటంతో ప్రత్యేకంగా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రోడ్డుకు ఎడమవైపుని వాహనాలు నడపాలని, కుడివైపున నడపడం వల్ల ప్రమాదాలకు కారణమవుతాయనే విషయాన్ని తెలియజేయాలన్నారు. సాయంత్రం సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. రాంగ్ రూట్‌లో వెళ్లేవారు పై ఈ చలాన్స్ విధిస్తు రాంగ్ రూట్ ప్రయాణాలను నివారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ పాండే రావు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు

## స్పందించి..సకాలంలో చేర్చి




నవతెలంగాణ-ముథోల్

ఇంటర్ విద్యార్థి పరీక్ష కేంద్రానికి వెళ్లాల్సి ఉండగా మరో పరీక్ష కేంద్రానికి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకొని సరైన పరీక్ష కేంద్రానికి చేరటానికి పరుగులు పెట్టారు. దీన్ని గమనించిన ఎస్సై సంజీవ్ తన పోలీస్ వాహనంలో పరిక్ష కేంద్రానికి విద్యార్థిని చేర్చి పరీక్ష రాసేలా చేశారు. దీంతో ఎస్సై చేసిన మంచి పనికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ముథోల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు ఓ విద్యార్థి బుధవారం రాయాల్సింది. అయితే ఉదయం పొరపాటున గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రానికి వెళ్లాడు. తీరా అక్కడ వెళ్లేసరికి పరీక్ష కేంద్రం మార్పును గమనించడంతో వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థి పరుగులు పెట్టారు. ఈ విషయాన్ని విధి నిర్వహణలో ఉన్న ఎస్సై సంజీవ్ తెలుసుకున్నారు. తన పోలీస్ వాహనంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి విద్యార్థిని సకాలంలో తీసుకవచ్చారు. విద్యార్థికి సరైన సమయంలో పరీక్ష కేంద్రానికి ఎస్సై తీసుకురావడంతో విద్యార్థి పరీక్ష రాయగలిగాడు. దీంతో ఎస్సైకి స్థానిక నాయకులు, పలువురు అభినందించారు. విధి నిర్వహణతో పాటు విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పోలీస్ వాహనంలో కేంద్రానికి చేరవేసిన తీరును అభినందించారు.

## తల్లి పరీక్ష కేంద్రంలో.. బిడ్డ ఉయ్యాలలో..



నవతెలంగాణ-ఉట్నూర్

గాదిగూడ గ్రామానికి చెందిన ఓ తల్లి బుధవారం నుంచి ప్రారంభమైన మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు రాసేందుకు తన చంటి బిడ్డతో వచ్చింది. ఉట్నూర్ మండలంలోని టీడబ్ల్యూఆర్‌జేసీ లాల్ టెక్డి పరీక్ష కేంద్రంలె పరీక్షలకు హాజరు కావాలని ఓ తల్లి చీరను ఊయలగా మార్చి..బిడ్డను అందులో పడుకోబెట్టి మరీ వెళ్ళింది. ఆమె పరీక్ష రాసే వరకు బిడ్డ అమ్మమ్మకు ఆలనా పాలనా అప్పగించింది. చదువుకున్న తల్లికి ఇది మరో పరీక్ష అయ్యిందని చెబుతున్నారు.

## మహిళల ఎదుగుదలకు చేయూతనందించాలి

• అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నవతెలంగాణ-నిర్మల్




బేటి బచావో బేటి పడావో పోస్టర్లను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్, జిల్లా జడ్జి, అధికారులు

మహిళల ఎదుగుదలకు చేయూతనందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల వేడుకలలో భాగంగా మంగళవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బేటి బచావో, బేటి పడావో కార్యక్రమం ప్రారంభమై 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 22 నుంచి మార్చి 8 వరకు 45 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలలో విద్యార్థులకు మహిళ విద్య ఆవశ్యకత, మహిళా సాధికారిత, బాలికలు, మహిళల హక్కులు, చట్టాలు ఇతర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. విద్యార్థి దశ నుంచే బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు, ఇతర అంశాలపై అవగాహనను పెంపొందించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే మహిళ సంక్షేమ అధికారులంతా సమాజంలో బాలికలు, మహిళలకు ఇబ్బందులు కలిగితే వెంటనే రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆడపిల్లలు కుటుంబానికి భారం కాదని, నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. 100, 1098,181, 1930 హెల్ప్ లైన్ నంబర్లపై బాలికలు, మహిళలు పరిజ్ఞానం కలిగి ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. దేశాభివృద్ధిలో మహిళలంతా కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జి. రాధిక మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన హక్కులు, చట్టాలపై మరింత విస్తృత అవగాహన పెంపొందించాలన్నారు. మహిళలందరికీ న్యాయపరమైన సాయాన్ని అందిస్తామని తెలిపారు. బాల్య వివాహ నిర్మూలన చట్టం-2006పై చైతన్యం కలిగించాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి బేటి బచావో, బేటి పడావో ప్రతిజ్ఞ చేసి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ నాగమణి, డీఎంహెచ్ఓ డా.రాజేందర్, ఏఎన్ఎం, ఆశాలు, మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో ఉపన్యాసం




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సైన్స్ కళాశాలకు చెందిన హిందీ అధ్యాపకురాలు డా.రాధ హిందీ పాఠ్యాంశం వాపసి( తిరిగి ప్రయాణం) ఉషా ప్రియా వంద రచించిన పాఠ్యాంశంను విద్యార్థులకు బోధించారు. అనంతరం రాధను శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, హిందీ విభాగం అధ్యాపకురాలు పి.పూనం అనిత, సంతోషిని, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణానికి ఎంపిక చేసిన మేస్త్రీలకు శిక్షణ



మేస్త్రీకి కిట్‌ను అందిస్తున్న కల్టెర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఆయా గ్రామాల నుంచి ఎంపిక చేసిన మేస్త్రీలకు శిక్షణ ఇస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. న్యాక్ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు మేస్త్రీలకు ఇచ్చే శిక్షణ సోమవారం ప్రారంభమైంది. బుధవారం మూడవ రోజు మేస్త్రీలకు కలెక్టర్ జడ్పీ కార్యాలయంలో కిట్లను అందించారు. అనంతరం శిక్షణ అందిస్తున్న న్యాక్ సిబ్బందికి మెమోంటోలు అందించారు. ఈ సందర్భంగా మేస్త్రీలతో కలిసి ఇంటి నిర్మాణానికి సంబంధించి ముగ్గును పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతుందన్నారు. ఇప్పటికే ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఎంపిక ప్రక్రియ పూర్తి చేశామన్నారు. 17 మండలాల నుంచి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మేస్త్రీలకు న్యాక్ ఆధ్వర్యంలో ఆరు రోజులు శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. మేస్త్రీలు శిక్షణను సద్వినియోగం చేసుకుంటు మంచి నిర్మాణాలు చేపట్టాలన్నారు. త్వరలోనే పనులు ప్రారంభం అయితే మేస్త్రీలకు ఉపాధి కూడా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జితేందర్ రెడ్డి, హౌజింగ్ పీడీ బసవేశ్వర్, న్యాక్ ఏడీ నాగేంద్ర, ఇన్‌స్ట్రకర్లు రమేష్, మహేష్, మేస్త్రీలు పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ పరిశుభ్రతయే ధ్యేయంగా పని చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్రదేవేందర్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని దుర్గానగర్ మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు మురికి కాలువలను శుభ్రం చేస్తున్న జవాన్‌తో పాటు సిబ్బంది కాలనీకి చెందిన కొందరు దాడికి పాల్పడ్డారని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ వారి ఆరోగ్యంతో పాటు ప్రాణాలను పణంగా పెడుతున్న వారిపై దాడులకు పాల్పడడం సరైన పద్ధతి కాదన్నారు. పోలీసులు వెంటనే దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విధులు బహిష్కరించి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చిరంజీవి కాంతరావ్, మెరుగు చిరంజీవి, ఎన్.నారాయణరెడ్డి, సురేష్, లక్ష్మీ, సంగీత, శాంతబాయి, అశోక్ పాల్గొన్నారు.

## దళిత, బహుజన పార్టీలో పలువురి చేరిక

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



దళిత బహుజన పార్టీలో పలువురు చేరారు. బుధవారం టీఎన్జీఓ సంఘ భవనంలో పార్టీ జిల్లా సమావేశం నిర్వహించారు. పలువురు పార్టీలో చేరాగ వారికి పదవులను ఇస్తు నియమక పత్రాలను అందించారు. జిల్లా అధ్యక్షురాలు గా బొబ్బిలి మంజుల, జిల్లా కార్యదర్శిగా నల్యాల కాశవ్వ, పార్టీ అనుబంధ సంస్థ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా బత్తుల నరేష్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్, ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ రాజుకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న 3 సంవత్సరాల పాటు మాలల ఐక్యత, హక్కుల కోసం నిరంతరం పాటుపడతామని తెలిపారు. కార్యక్రమంలో కుంటోల్ల వెంకటస్వామి, పసుల రాజలింగం, అర్ల రమేష్, మసూరే అర్చన, ఈ.పురుషోత్తం, వంశీ, పాతర్ల ధర్మరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

## కల్తీలేని ఆహార పదార్థాలనే విక్రయించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బహిరంగ మార్కెట్ లో కల్తీ ఆహార పదార్థాలతో ప్రజలు అనారోగ్యాల పాలావుతున్నారని ఈ నేపథ్యంలో ప్రతి వ్యాపారి నిబంధనలు పాటిస్తూ కల్తీలేని ఆహార పదార్థాలనే విక్రయించాలని వినియోగ దారుల హక్కుల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొమ్మటి కిరణ్ తెలియజేశారు. ఇదే సమయంలో ప్రజలను చైతన్యం చేసేలా విస్తృత కార్యక్రమలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, వాటర్ ప్లాంట్లు, పండ్లు, హోటల్ వ్యాపారులు విధిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఐఎస్ఐ ప్రమాణాలతో కూడిన పదార్థాలనే వాడాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే చర్యలను ఉపేక్షించబోమని సంబంధిత వ్యాపార సంస్థలపై చట్టరీత్యా చర్యలుంటాయని హెచ్చరించారు. గత సంవత్సరం మామిడి పండ్లను మగ్గించేందుకు విష పూరిత కార్బైడ్ వినియోగాన్ని పసిగట్టి మామిడి పండ్లను సరఫరా చేస్తున్న లారీలను సీజ్ చేయించిన సంగతిని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఇర్ఫాన్, హేమవతి, స్వప్న, రమ, సురేందర్, శ్రీకర్ పాల్గొన్నారు.




## మధుసూదన్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విజయ డెయిరీ డీడీగా విధులు నిర్వహిస్తున్న మధుసదన్ జీఎంగా హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. బుధవారం తత్వమాసి యోగ క్లబ్ ఆధ్వర్యంలో మధుసుదన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న బంధాలను గుర్తు చేసుకున్నారు. విజయ డెయిరీలో డీడీగా విధులు నిర్వహిస్తు హైదరాబాద్‌కు బదిలీ వెళ్తున్నట్లు తెలిపారు. ఇక్కడ పని చేసిన కాలం అందరి సహకారం లభించిందన్నారు. అదే విధంగా డీడీగా మధుసుదన్ తమకు అందించిన సహకరం మరిచిపోమని యోగా శిక్షకులు విజయ్ అన్నారు. ఆయన బదిలీపై జీఎంగా హైదరాబాద్‌కు వెళ్లడం సంతోషంగా ఉన్న తమను వీడుతున్నందుకు బాధగా ఉందన్నారు.

## లంబాడిగూడ కార్యదర్శిపై విచారణ

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని లంబడిగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి మడిశెట్టి శ్రీనివాస్ ఇంటి అనుమతుల కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. బుధవారం డీఎల్పీఓ ఉమర్ హుస్సేన్, ఎంపీఓ గౌరీ శంకర్ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేసినట్టు తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శితో వివరణ తీసుకున్నారు. ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

## దశాల వారీగా ఇందిరమ్మ ఇల్లు బిల్లు మంజూరు

నవతెలంగాణ-జైనూర్



ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేస్తున్న ప్రతి ఒక్కరికి దఫళ వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిధులు మంజూరవుతాయని లింగాపూర్ మండల ఎంపీడీఓ రామ్‌చందర్ అన్నారు. బుధవారం మండలంలోని జాముని ధర గ్రామంలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇల్లుకు ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రత్నం స్పెషల్ ఆఫీసర్ అరవింద్, గ్రామపంచాయతీ కార్యదర్శి అంబాజీరావు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆత్రం అనిల్ పాల్గొన్నారు.

## ఉన్నత చదువు కోసం పోటీపడాలి




నవతెలంగాణ-జైనూర్

పదవ తరగతి విద్యార్థులు ఉన్నత చదువు కోసం పోటీపడాలని హ్యూమన్ రైట్స్ సిబ్బంది, గ్రామ పటేల్ మగడే గంగాధర్ పూసమ్ హన్మంతరావు అన్నారు. బుధవారం మండలంలోని పట్నాపూర్ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి మెట్టు వేస్తున్న సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు మంచిగా పరీక్షలు రాసి పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. విద్యార్థులు భయపడకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని, విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖండారే బాలాజీ, గ్రామ పెద్దలు పూసమ్ జగన్నాథ్ రావు, ఆర్గనైజర్ సూదం, మండల అధ్యక్షుడు నగేష్, సోయం సంపత్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజన్నా, ఆత్రం జగన్నాథ్ రావు, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, రాజేంద్రప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థితిగతులపై అధ్యయనం



నవతెలంగాణ-జైనూర్

అడవికి దగ్గరలో ఉండే గ్రామాల్లో జీవించే వారి విధానం, అడవిపై వారి జీవన ఆధారం, వారి స్థితిగతులపై అధ్యయనం చేస్తున్నట్టు ఎఫ్‌సీఆర్ఐపీహెచ్‌డీ విద్యార్థి రోహిత్ తెలిపారు. బుధవారం జోడేఘాట్ రేంజ్ పరిధిలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఇస్లాంపూర్ సెక్షన్ పరిధిలో గల పిట్టగూడ పిక్లతండా కొత్తపల్లి, మోతిపటర్ గ్రామాల్లో అటవీ శాఖ బృందం ప్రత్యేకంగా పర్యటించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఉన్న గ్రామస్తులతో వారి స్థితిగతులపై అడవి పై జీవనాధారం ఉన్నటువంటి గ్రామస్థులతో కలిసి చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి అనుష, బీట్ అధికారి మహేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు లోఖేందర్, సునీల్, మాజీ సర్పంచులు ఉదయ్ సింగ్, కిషన్, నాను, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బుద్ధ విహార్‌ను బౌద్ధ భిక్షులకు అప్పగించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయాలో ఉన్న మహాబోధి బుద్ధ విహార్‌ను బౌద్ధ భిక్షులకు అప్పగించాలని కోరుతూ బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మధూకర్‌కు వినతిపత్రం అందించారు. 1949లో అప్పటి బీహార్ రాష్ట్ర ప్రభుత్వం చట్టం తయారుచేసి బౌద్ధ భిక్షుల ఆధీనంలో ఉన్న బుద్ధ విహార్‌ను బ్రాహ్మణ పండితులకు అప్పగించిందని, దీనిని తిరిగి బౌద్ధ భిక్షులకు అప్పగించాలని ఆ వినిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా తాలూకా అధ్యక్షులు కె దేవాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి డి విస్తారు. తాలూకా ఉపాధ్యక్షులు సిహెచ్ గోవింద్‌రావుతో పాటు నాయకులు పాల్గొన్నారు.

## వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-జైనూర్

గిరిజన ఆశ్రమం పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్ రావు, జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఎం శ్రీఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్వహించిన ఫేర్వెల్, వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎం శ్రీలో పాఠశాలను ఎన్నుకోవడం శుభ పరిణామమని అన్నారు. ఈ పాఠశాలలో 30 సంవత్సరాలు నుండి ఎంతో మంది విద్యార్థులు ప్రయోజకులయ్యారన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆత్రం పార్వతి, ఎస్సై సాగర్, ఉపాధ్యాయులున్నారు.

**హెడ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్యాడ్ల పంపిణీ**

పీఎం శ్రీ ఆశ్రం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెడ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లీ పంపిణీ చేశారు. హెడ్ సొసైటీ మంచి కార్యక్రమాలు నిర్వహించడంతో సేవలను గుర్తించి లభిస్తుందని, ఈ సందర్భంగా హెడ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకాంత్‌ను అభినందించారు.



# కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని సీఐటీయూ అనుబంధ బెల్లంపల్లి ఏరియా గోలేటి బ్రాంచ్ ఇన్‌చార్జి వెలిశా క్రిష్ణమాచారి, కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం గోలేటి పరిధిలోని కాంట్రాక్టు కార్మికుల అన్ని విభాగాల్లో పనిచేస్తున్నా కార్మికుల అడ్డాల వద్దకు వెళ్లి కలిసి ఆటో జాత బృందం పలు అంశాలపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 మార్చి 1-7 వరకు క్యాంపెయిన్ రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్లలో కనీస వేతనాల డ్రాఫ్ట్ జీఓలను విడుదల చేసిందన్నారు. వేతనాల నిర్ణయం అశాస్త్రీయంగా చేసిందన్నారు. పాత వీడీఏను ప్రస్తుతం పొందుతున్న వేతనంలో కలిపారే తప్ప కొత్త డ్రాఫ్ట్ జీఓలలో నయా పైసా పెంచలేదన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ జీఓలను సవరించాలని, కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కూడా పారిశ్రామిక యజమానులకు లాభాలు పెంచడం కోసం మాత్రమే కార్మికుల వేతనాలు పెంచటం లేదని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాల్సిన తరుణంలో జీఓల సవరణ పేరుతో తగ్గించి తన వర్గ నైజాన్ని చాటుకుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షురాలు శారధ, నాయకులు రాజ్ కుమార్, జంగు, అనితా, విజయలక్ష్మీ, జయలక్ష్మి పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఆటో జాత బృందం సభ్యులు

# రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు



స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 3.6 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కాగజ్‌నగర్ నుండి సింగరేణి రైలు ద్వారా మహారాష్ట్రలోని వీరూర్‌కు అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌గౌడ్, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టగా ఈ బియ్యం స్వాధీనమైనట్లు తెలిపారు. ఈ బియ్యం నలుగురు మహిళలు తరలిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారం రోజుల క్రితం కూడా ఇదే రైల్వేస్టేషన్‌లో సుమారు 28.8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని, ఈ బియ్యం మొత్తం విలువ రూ. 1.19 లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే బియ్యం దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

**సిర్పూర్(టి) :** ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని ఇతరులకు అమ్మిన, కొనుగోలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని డీటీ రాజ్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో సింగరేణి రైలు ద్వారా మహారాష్ట్రలోని వీరూర్‌కి అక్రమంగా రవాణ చేసేందుకు ఉన్న బియ్యాన్ని పట్టుకున్నారు. సుమారు 5.05 క్వింటాళ్ల రేషన్ బియాన్ని పట్టుకున్నట్లు, బియ్యం సంచులను తరలించే వ్యక్తులు తరలించే వ్యక్తులు పారిపోయినట్లు తెలిపారు.



సిర్పూర్ (టి) : పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో పోలీసులు

# ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలే లక్ష్యం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సరైన విధంగా అమలు చేయడమే తమ లక్ష్యమని దీనికోసం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా కలెక్టర్ ఛాంబర్‌లో డీపీఆర్ఓ సంపత్ ఆధ్వర్యంలో పాత్రికేయులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ చూపడం జరుగుతుందన్నారు. వసతిగృహాల్లో రాత్రి బసచేయడం వల్ల విద్యార్థుల మంచి చెడులు తెలుసుకోవడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. జిల్లాలో నీటిసమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో జనవరి మాసం నుండి ముందుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. వేసవిలో విద్యుత్ సమస్య లేకుండా ముందస్తు కార్యాచరణలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడంతో పాటు విద్యుత్తు లైన్లను సరిచేయడం జరుగుతుందని తెలిపారు. ఏడాదికాలం పాటు జిల్లాలో పనిచేయడం వల్ల ఈ ప్రాంతంలో ఎంతో నేర్చుకోవడం జరిగిందని, రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంతో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలో అందించేందుకు సంబంధిత శాఖల ద్వారా లక్ష్యాలను చేరవేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న పాత్రికేయులు

## బాలికల సమగ్ర అభివృద్ధికి కృషి

- జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలికల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఇదే సందర్భంలో బాలికలు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని అవి సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా మహిళా, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మహిళా సాధికారిక కేంద్రం సమన్వయకర్త శారద అధ్యక్షతన నిర్వహించిన భేటీ బచావో-భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే చదువులో రాణించాలని తెలిపారు. విద్యార్థినీలు యుక్త వయసు సమయంలో మరింత శుభ్రత పాటించాలని, శరీరం ధృఢంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ఏకాగ్రత ఉంటుందని, క్రీడారంగంలో సైతం రాణించాలని తెలిపారు. బాలికలను కాపాడుకోవడం, చదివించుకోవడంతో పాటు వారికి స్వేచ్ఛగా అన్ని రంగాలలో తోడ్పాటు అందించాలన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 10వ తేదీ వరకు జిల్లాలోని 40 ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలలో ప్రత్యేక బృందం ద్వారా ప్రేరణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించే దిశగా ప్రజలందరూ స్వచ్ఛందంగా సహకరించాలని, బాలికల చదువు కుటుంబానికి, దేశానికి ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ నలంద, సుండిల్ల రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## లక్ష్యంపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-బెజ్జూర్

చదువులో లక్ష్యాన్ని సాధించాలంటే ఎలాంటి గోల్‌ని ఎంచుకోవాలనే దానిపై ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని జడ్పీఎస్ఎస్ ఆశ్రమ పాఠశాలలో అవగాహన కల్పించారు. సమయం గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించి తెలపడంతో పాటు గోల్ సాధించాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు ద్వారా వివరించారు. అనంతరం ఇటీవల డాక్టరేట్ తీసుకున్న ఎంఈఓ సునీతను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు చెంచులక్ష్మి, క్లబ్ నెంబర్లు దుర్గ రాజేశ్వరి, మౌనిక, శృతి, పద్మ, సుజాత, కవిత, లక్ష్మి, విష్ణువర్ధన్, హరీష్ పాల్గొన్నారు.

## బల్లార్షా బొటానికల్ గార్డెన్‌కు విద్యార్థులు

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని సావర్‌ఖేడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం బల్లార్షాలోని బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బొటానికల్ గార్డెన్‌లోని ప్రత్యేకతలను ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో పాటు మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, సావర్ ఖేడ ప్రధానోపాధ్యాయులు కాదెర్ల రంగయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, భరత్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.




# మొదటిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

- సెంటర్లు తనిఖీ చేసిన జిల్లా అధికారులు
- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



ఆసిఫాబాద్‌లో..

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు పరీక్ష జరగగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 19 సెంటర్లలో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు అధికారులు తెలిపారు.

**మొదటిరోజు 95శాతం హాజరు**

ఇంటర్మీడియట్ పరీక్షలకు మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 95.11శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కళ్యాణి తెలిపారు. మొదటి సంవత్సరం మొత్తం 5076 మంది విద్యార్థులు ఉండగా వీరిలో జనరల్ విద్యార్థులు 4283 మంది, ఒకేషనల్ విద్యార్థులు 793 ఉండగా జనరల్ విద్యార్థులు 4100 మంది, ఒకేషనల్ విద్యార్థులు 728 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలకు 248 మంది గైర్హాజర్ కాగా, వీరిలో 183 మంది జనరల్ విద్యార్థులు, 65 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు.

**సెంటర్లు తనిఖీ చేసిన జిల్లా అధికారులు**

ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాల సెంటర్‌ను కలెక్టర్ వెంకటేష్ ధోత్రే పరిశీలించగా, పీటీజీ కళాశాల సెంటర్‌ను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని కళ్యాణి సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కాకుండా చూడాలని ఆదేశించారు.

**పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు**

జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాలతో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రాల్లోని గిరిజన బాలుర కళాశాలలో ఏర్పాటుచేసిన సెంటర్‌ను ఎస్పీ డివి శ్రీనివాసరావు, సీఐ రవీందర్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్‌తో కలిసి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను లోనికి పంపించేటప్పుడు తనిఖీ చేసి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 అమల్లో ఉంటుందని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**కౌటాల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో బుధవారం ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ బాలక్రిష్ణ మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు మొత్తం 189 గాను 176 మంది హాజరు కాగ 13 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 121 కి గాను 104 మంది విద్యార్థులు హాజరయ్యారు. 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఎస్సై ఎన్.మధుకర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

**బెజ్జూర్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 164 మందికి గాను 153 విద్యార్థులు హాజరు కాగా 11 మంది విద్యార్థులు గైరాజరైనట్లు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ సపన్ మండల్, డీఓ రాజం తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కెరమెరి :** ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభమై 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పరీక్ష కేంద్రం లోనికి వెళ్లే ముందు ఇన్విజిలేటర్లు తనిఖీలు చేపట్టి లోనికి అనుమతించారు. మండలంలోని కేజీబీవీ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 15మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కెరమెరిలో...

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | మార్చి 06, 2025 | www.navatelangana.com



## ముత్యంపల్లి పాఠశాలలో ఆకట్టుకున్న విజ్ఞాన మేళా

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ విజ్ఞాన మేళా ఆకట్టుకుంది. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్ఎం ముక్తరవం వెంకటేశ్వర స్వామి అధ్యక్షతన సైన్స్ ఉపాధ్యాయులు బండ శాంకరీల ఆధ్వర్యంలో చేపట్టిన సైన్స్ విజ్ఞాన మేళాలో విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టు రూపొందించి వాటి ప్రాధాన్యతలను వివరించారు. ఈ సైన్స్ ఫేయిర్‌లో విశ్వసూర్య మొదటి మహుమతి, ఆయేషా, రాహుల్ ద్వితీయ బహుమతి, సమ్రీన్ తృతీయ బహుమతి సాధించారు. అనంతరం సైన్స్ టీచర్లు బండ శాంకరి, జ్యోతిలను శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, మాధవి లత, పల్లె కృష్ణ గోపాల్ రావు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వివిధ దేశాల కరెన్సీ, నాణేల ప్రదర్శన

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని లక్ష్మీపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జిల్‌పల్లివార్ అనిల్ కుమార్ పాఠశాలలో విద్యార్థులకు తాను సేకరించిన వివిధ దేశాల కరెన్సీ నాణేలను(31 దేశాల) ప్రదర్శన చేపట్టి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు వివిధ దేశాలకు సంబంధించిన కరన్సీని ఆసక్తిగా తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు కొత్త సురేష్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లలకు జనరల్ నాలెడ్జ్‌తో పాటు చక్కని అభిరుచులు అలవరుస్తాయని పలువురు ఉపాధ్యాయులు అనిల్‌కుమర్‌ను అభినందించారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-జైపూర్

జిల్లాలో ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా పకడ్బందీగ నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 4 వేల 965 మంది జనరల్, 935 మంది ఒకేషనల్, ద్వితీయ సంవత్సరంలో 5 వేల 625 మంది, 1 వేయి 15 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రనికి మొబైల్, ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదని, అత్యవసర వైద్య సేవలు నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో సమయానుసారంగా బస్సులు నడిపించడం జరుగుతుందని, పరీక్ష ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలను బందోబస్తు మధ్య తరలించారని తెలిపారు. ఆయన వెంట ఏసీపీ వెంకటేశ్వర్లు తహసీల్దార్ వనజరెడ్డి ఉన్నారు.

**ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు**

**కాసిపేట :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఫస్టియర్ పరీక్షలతో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జనరల్ విద్యార్థులు మొత్తం 193 మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరయ్యారు. ఒకేషనల్లో మొత్తం 37 మంది విద్యార్థులకు ఐదుగురు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా సీహెచ్ రాజేశ్వరి, డిపార్ట్మెంట్ ఆఫీసర్ బి శ్రీనివాస్ విధులు నిర్వహించారు. ఇదిలా ఉండగా గురువారం ఇంటర్ సెకండీయర్ పరీక్షలు ప్రారంభం కానుండగా సెకండీయర్‌లో జనరల్ విద్యార్థులు 159, ఒకేషనల్ 33 మంది విద్యార్థులు మొత్తం 198 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.



ప్రభుత్వ జూనిర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల :** జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అరగంట ముందే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి లాంగ్వేజ్ పరీక్షా నిర్వహించారు. జనరల్ విద్యార్థులు 5697 విద్యార్థులకు గాను 5472 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 225 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వొకేషనల్ విద్యార్థులు 668 మంది విద్యార్థులకు గాను 606 మంది విద్యార్థులు హాజరవ్వగా 62 మందివిద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ అంజయ్య తెలిపారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. అన్ని సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగుండము పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాసులు పరిక్షల అనంతరం జవాబు పత్రాలను పోలీస్ ఎస్కార్ట్ సహాయంతో తరలించారు.

**జన్నారం :** మండల కేంద్రంలో నిర్వహించిన రెండు ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో మొత్తం 19 మంది గైర్హాజర్ అయినట్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని కరిమల జూనియర్ కళాశాలలో మొత్తం 129 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 121, పరీక్షలు రాయగా 8 మంది గైరాజర్ అయ్యారన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 145 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 134 పరీక్షలు రాయగా 11 మంది గైరాజర్ అయినట్లు వారు తెలిపారు. అలాగే ఆయా పరీక్ష కేంద్రాలను మండల తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఎస్ఐ రాజ వర్ధన్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలు విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాయాలని సూచించారు. మాస్ కాపీకి పాల్పడవద్దని పేర్కొన్నారు.



మంచిర్యాల : పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థి



జన్నారం : పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



మంచిర్యాల : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



మంచిర్యాల : పరీక్ష కేంద్రంలోకి వరుసగా వెళ్తున్న విద్యార్థులు

## ఏస్టీపీపీ 3వ యూనిట్ ప్రారంభానికి సిద్ధం చేయాలి

- డైరెక్టర్ ఈ అండ్ ఎం సత్యనారాయణ రావు



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ మూడవ యూనిట్ ప్రారంభించడానికి అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని డైరెక్టర్ ఈ అండ్ ఎం సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంటును ఆయన సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా మూడో యూనిట్‌కి సంబంధించి స్థల పరిశీలన, ఫైలాన్ నిర్మించే స్థలం పరిశీలించారు. రాబోయే కొద్ది రోజుల్లో మూడో యూనిట్ పనులు ప్రారంభం కావచ్చని అధికారులందరూ అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసే అతిథులకి ఏమాత్రం లోటు పాట్లు లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా ప్లాంటులో బాయిలర్ ఏరియాను పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి, ఉత్పాదకతను గమనించారు. ప్లాంట్‌ను ఎటువంటి సమస్య లేకుండా పనిచేసే విధంగా చూడాలని విభాగాధిపతులను, అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి చేయాలన్నారు. ప్రస్తుత ప్లాంట్ పని తీరు పట్ల ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీపీపీ ఇన్‌చార్జి ఈడీ కె శ్రీనివాసులు, చీఫ్‌ఆఫ్(ఓ అండ్ ఎం) జెఎన్ సింగ్, ఏజీఎం(సివిల్) కెఎస్ఎన్ ప్రసాద్, డీజీఎం(ఆపరేషన్స్) ఎంవీ వేణుగోపాలరావు, సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్, సముద్రాల శ్రీనివాస్, మేనేజర్ ఫారెస్ట్ చంద్రమణి పాల్గొన్నారు.


## ఉపాధి పనులపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కె సరోజ ఆధ్వర్యంలో బుధవారం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎఫ్ఏలు ఉన్న ప్రతి గ్రామపంచాయతీలో 80 మంది, మేట్స్ ఉన్న గ్రామపంచాయతీలలో 40 మందికి తక్కువ కాకుండ పనులు నిర్వహించాలని, ప్రతి టీఏ 300 శాతం సెల్ఫ్ ఎస్టిమేషన్ చేయాలని సూచించారు. గ్రామపంచాయతీలలో పనులు లేవని ఎవరు కూడచెప్పవద్దని, పనులు పంచాయతీ సెక్రటరీ, ఇతర గ్రామ పెద్దల సహకారంతో సిబ్బంది పనులు సృష్టించుకోవాలని అన్నారు. గురువారం నుంచి లేబర్ ఇంప్రూమెంట్ చేయకపోతే సంబంధిత సిబ్బందిపై శాఖపరమైన చర్యలకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని హెచ్చరించ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గనుల్లో యంత్రాలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఉపరితల గనులలో యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌తో కలిసి శ్రీరాంపూర్‌లోని ఉపరితల గని, ఓసి సీహెచ్‌పీని తనిఖీ చేశారు. అనంతరం ఉపరితల గనిలో కోల్ ఎక్స్పోజర్ ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఉపరితల గని లోని భారీ యంత్రాల నిర్వహణలో అవసరమైన సూచనలనిస్తూ, వాటి ఉపయోగాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ జనరల్ మేనేజర్ సీహెచ్‌పీ తిరుమల్ రావు, ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, కార్పొరేట్ డీజీఎం సీహెచ్చి కేశవరావు, డీజీఎం వర్క్ షాప్ రవీందర్, క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ నాగరాజు, ఉపరితలగని మేనేజర్ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సోమగూడెం ఆదిత్య మెడికల్ షాప్ యాజమాని కందికట్ల రాంప్రకాశ్, ఎల్వోసీ ఏజెంట్, ఐకేపీ వీఓఏ పేరాల మహేశ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందించారు. విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు కావాల్సిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేల్లు, రబ్బర్లు మొత్తం పరీక్షా సామాగ్రిని దాత పేరాల మహేశ్ ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు. స్వయంగా తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులకు తన వంతుగా సహాయం చేయాలనే ఉద్దేశంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందించానని, దీనికి ఆనందంగా ఉందని దాత పేరాల మహేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, జ్యోతి, మాదవి లత, పల్లె కృష్ణ గోపాల్ రావు, చంద్రశేఖర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి చొరవతో స్వదేశానికి మృతదేహం





నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలం హనుమంతుపల్లి గ్రామానికి చెందిన గుమ్ముల కొమురయ్య(48) విధి నిర్వహణలో భాగంగా ఓమన్ దేశంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి అధ్యక్షుడు మగ్గిడి తిరుపతి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి కృషి చేయాలని మాజీ మండల అధ్యక్షుడు పాలాజీ శ్రీనివాస్(ఒమన్)కి తెలియపరచగా ఆయన వెంటనే ఇండియన్ కౌన్సిలేట్, ఒమన్ పోలీస్, కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి మతుని కుటుంబానికి రావాల్సిన పరిహారం, డెడ్ బాడీ రాకముందే అందేలా ప్రత్యేక చొరవ చూపారని నాయకులు తెలిపారు. కేవలం ఆరు రోజుల్లోనే డెడ్ బాడీ స్వదేశానికి పంపే ప్రక్రియ పూర్తిచేసిన శ్రీనివాస్‌కు మండల అధ్యక్షుడు మగ్గిడి తిరుపతి, వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్యకు మృతుని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాదు విమానాశ్రయం నుండి మృతుని ఇంటి వరకు ప్రభుత్వ ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని మంద భీమ్‌రెడ్డి ఏర్పాటు చేశారని తెలిపారు.

## యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్



నవతెలంగాణ-హాజీపూర్

యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పదవ తరగతి టాలెంట్ టెస్ట్ బహుమతులు ప్రధానోత్సవం బుధవారం మండలంలోని మౌంట్ కార్మల్ హైస్కూల్ మైదానంలో నిర్వహించారు. యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెవుటు మల్లేష్, మిట్టపల్లి తిరుపతిల ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ యాదయ్య హాజరయ్యారు. పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేపర్లు తయారుచేసి వివిధ పాఠశాలల్లో నిర్వహించడం, విజేతలకు బహుమతులు ఇవ్వడం అభినందనీయమని, విద్యార్థి సమస్యలపై పోరాడడంతో పాటు విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న యుఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాన్ని అభినందించారు. డ్రగ్స్ గంజాయి వ్యతిరేక నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తిరుపతిరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ చౌదరి, సత్యనారాయణమూర్తి, కేజీబీవీ జిల్లా కోఆర్డినేటర్ యశోదర, సీర్పీ సరిత, కార్మల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అల్ఫీలు పాల్గొన్నారు.

# సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ హరీష్ చంద్రరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔట్సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న పేషంట్ కేర్, శానిటేషన్, స్వీపర్స్, సెక్యూరిటీ గార్డ్స్ తదితర సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. వైద్య విధాన పరిషత్ విభాగం పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఏరియా హాస్పిటల్స్, జిల్లా ఆస్పత్రులలో పనిచేస్తున్న సిబ్బంది పలు రకాల సమస్యలతో బాధపడుతున్నారని అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టర్‌లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వేతనాలు చెల్లించకుండా తక్కువ చెల్లిస్తున్నారని అన్ని ఆస్పత్రుల్లో ప్రభుత్వం నిర్ణయించిన రూ.16,600లలో కార్మికుడికి రూ.12,093 చెల్లించి మిగిలినవి పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాలలో జమ చేయవల్సి ఉంటుందని అన్నారు. కానీ కాంట్రాక్ట్ సంస్థలు అన్నీ కుమ్మక్కై రాష్ట్రవ్యాప్తంగా రూ.10,500, రూ.11,000 మాత్రమే చెల్లిస్తున్నారని వివరించారు. ఈ విధంగా కార్మికులకు సంబంధించిన రూ.లక్షలు కాజేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం చెల్లించే విధంగా హాస్పిటల్స్ అధికారులకు, కాంట్రాక్టర్లకు తగిన ఆదేశాలు ఇవ్వాలని, వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

# పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని జెండా వెంకటాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పదవ తరగతి గదిలోకి వెళ్లి తనకు నచ్చిన రూల్ నెంబర్ 5, 12 విద్యార్థులను పిలిచి ఇంగ్లీషు సబ్జెక్టుకు సంబంధించి ప్రశ్నలు వేసి బోర్డు పైన ఆన్సర్ రాయించారు. వారు రాసిన ఆన్సర్స్‌కి డీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రేపటి నుంచి జరిగే పదవ తరగతి ప్రీ ఫైనల్, ఫైనల్ ఎగ్జామ్స్ దగ్గరగా ఉన్నాయి. గనుక ఇంకా బాగా కష్టపడి మంచి మార్కులు సంపాదించి మీకు, మీ తల్లిదండ్రులకు, మీ గురువులకు, మీ ఊరికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పది నిమిషముల పాటు మోటివేషన్ క్లాస్ చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తర్వాత జెండా వెంకటాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యశోదరకి, పదవ తరగతి బోధించే ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులు ఆన్సర్ చెప్పిన విద్యార్థులు ఇద్దరిని రోల్ నెంబర్ 5, వైష్ణవి, రూల్ నెంబర్ 12,అజిత్ లను పిలిపించి సన్మానించారు. విద్యార్థులు ఇంకా బాగా చదివి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్లీవయ్య, జ్యోతిర్మయి, వాణిశ్రీ, దుర్గ ప్రసాద్, రమేష్, సతీష్, రెహనా బేగం, రవీందర్, వ్యాయామ ఉపాధ్యాయులు బెల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.



డీఈఓ అడిగిన ప్రశ్నకు బోర్డుపై జవాబు రాస్తున్న విద్యార్థి


## తపాలాపూర్ పోచమ్మ ఆలయంలో చోరీ

వతెలంగాణ-జన్నారం



మండలంలోని తపాలపూర్ గ్రామంలో ఉన్న ఊర పోచమ్మ ఆలయంలో చోరీ జరిగింది. తలుపులను ఉండిని పగలగొట్టి అందులో ఉన్న దాదాపు రూ.5 వేలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ చోరీ మంగళవారం రాత్రి జరిగినట్లు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జన్నారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్ఐ రాజా వర్ధన్ తెలిపారు.

## పులి అనుకొని భయపడ్డ గ్రామస్తులు
నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లాలో గత కొన్ని రోజులుగా పులి సంచారం పెరగడంతో పల్లెలతో పాటు పట్టణాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అదే క్రమంలో బుధవారం ఉదయం పాత మంచిర్యాల శివారు ప్రాంతాల్లో మేకలు కాసేందుకు వెళ్లిన కొందరికి పులి అడుగులు కనిపించాయంటూ స్థానికులకు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో అప్రమత్తమైన అధికారులు అక్కడికి వెళ్లి అడుగులను పరీక్షించగా అవి పులి అడుగులు కావని అడవి కుక్కలకు చెందిన పాద ముద్రలుగా గుర్తించారు. దీంతో మంచిర్యాలతో పాటు పాత మంచిర్యాల, వేంపల్లి, ముల్కల్ల గ్రామాల ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. శివారు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందొద్దని అటవీ శాఖ అధికారులు తెలిపారు.


# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

# ఆదిలాబాద్

గురువారం | మార్చి 06, 2025 | www.navatelangana.com




## నృత్య కళాకారునికి క్రేజీ స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డు
నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన నృత్య కళాకారుడు డొంగ్రి సంతోష్ క్రేజీ స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నాడు. మందమర్రిలో మంగళవారం క్రేజీ స్టార్ట్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంతోష్ ఈ అవార్డు అందుకున్నాడు. ధూం ధాం వ్యవస్థాపకులు అంతడుపుల నాగరాజు, హనుమాన్ల మధు, క్రేజీ స్టార్ డ్యాన్స్ మాస్టర్ నరేష్‌తో పాటు యూట్యూబ్ స్టార్స్ చేతుల మీదుగా సంతోష్ అవార్డు అందుకున్నాడు.

## సమీక్ష సమావేశంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశంలో జిల్లా డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు పాల్గొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొని మాట్లాడినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్క, ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథం, ఎమ్మెల్యే బొజ్జు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ



నవతెలంగాణ-కుబీర్

మండల కేంద్రానికి చెందిన అశ్రఫ్ బీ, ప్యాట పోతన్న, సంతోష్ పటేల్, సూది గంగారాం అనే నలుగురు ఇటీవల అనారోగ్యంతో మతి చెందడంతో వారి కుటుంబాలను బుధవారం బీఆర్ఎస్ ముధోల్ నియోజక వర్గ సమన్వయ అధ్యక్షుడు కిరణ్ కొమ్రేవార్ మండల అధ్యక్షుడు ఎన్నిలా అనిల్‌తో కలసి పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం అక్కడి నుంచి బెల్గంతాండ 1,2 కు వెళ్లి పలు కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కాశినాథ్, మాజీ సర్పంచ్ బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు

## విద్యార్థులకు అవగాహన
నవతెలంగాణ-రెబ్బెన

బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు బుధవారం ప్రేరణ, స్ఫూర్తిదాయక విషయాలపై అవగాహన కల్పించారు. మోటివేషనల్ స్పీకర్ సుమలత పరీక్ష సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయడాన్ని తెలియజేశారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని, నైతిక విలువలు కలిగిన విద్యార్థులు గొప్ప స్థాయికి ఎదుగుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ రాణి, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పద్మ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## కళాశాలలో మహిళా సైబర్ జాగృతి దినోత్సవం
నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ జాగృతి దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ బానిసత్వం, డిజిటల్ అరెస్ట్, ఉద్యోగ మోసాలు వేధింపులు అనే అంశాలపై సైబర్ డీఎస్పీ హసీబుల్లా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మహిళలు బాలిక విద్యార్థులపై దృష్టి సారించి, ఆదిలాబాద్‌లో జరుగుతున్న వివిధ సైబర్ నేరాల గురించి వివరించారు. అలాగే చట్టలపైన అవగాహన ఉండాలని,అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నంబర్‌లను సంప్రదించాలని, సైబర్ నేరాల వలలో పడొద్దని సూచించారు. కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ సునీల్, కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం, ఐటి కోర్ రియాజ్, షీ టీం ఏఎస్ఐ సునీత, వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, అనిత, రేఖ సంతోషిని, సౌజన్య, సోనీ, భువన, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'హక్కుల కోసం పార్టీ పని చేస్తోంది'
నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బడుగుబలహీన వర్గాల అభ్యున్నతితో పాటు వారి హక్కుల కోసం తమ పార్టీ పని చేస్తుందని భీం ఆర్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు షకీల్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ నగర్ కాలనీకి చెందిన పలువురు భీం ఆర్మీ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో పార్టీ వ్యవస్థాపకులు నాగిని ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ పేదల పక్షన గళం విప్పుతున్నారన్నారు. తాము కూడా జిల్లాలో పార్టీని విస్తృతం చేసేలా పని చేస్తామని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలకు ఆకర్షితులై యువత చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు.

## ఘనంగా ఆచార్యదేవోభవ కార్యక్రమం
నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల ఆచార్యదేవోభవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాథోడ్ సుభాష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షల పట్ల విద్యార్థులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, నిర్ణీతమైన సమయసారని పాటించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం కెరమెరి డెక్కన్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మల్యాల శ్రీపద్ పాఠశాలకు రూ.పదివేల విలువగల సైన్స్ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో విద్వత్ పరిషత్ కన్వీనర్ పెంద్యాల సదాశివ్, పాఠశాల అధ్యక్షులు చిలువేరి వెంకటేశ్వర్లు, పాఠశాల కార్యదర్శి కొడిపాక వేణుగోపాల్, నాగుల శ్రీనివాస్, కల్లూరి సంతోష్, నల్గొండ రమేష్, తంగళ్ళపెల్లి రమేష్, కొరిడె మహేష్ కుమార్, ముక్కా క్రిష్ణమూర్తి, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ
# ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రత్యేక వైకల్య గుర్తింపు(సదరం) కార్డుల జారీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. యుడిఐడి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కోసం మీసేవ కేంద్రాలను ఆశ్రయించేవారని, ఇప్పుడు మీసేవలతో పాటు యుడిఐడి పోర్టల్, సొంత మొబైల్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్, స్లాట్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. క్యాంపుల వివరాలు మెసేజ్‌ల ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల నుంచే అమల్లోకి తీసుకురావడం జరిగిందని, 21 రకాల వైకల్యం కలిగిన వారు యుడిఐడి(యూనిక్ డిజేబిలిటీ ఐడి) కార్డును పొందవచ్చని తెలిపారు. సదరం కార్డును పోస్టల్ ద్వారా సంబంధిత వ్యక్తులకు చేరవేయడం జరుగుతుందన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్నవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, వారికి ప్రస్తుతం ప్రభుత్వపరంగా అందుతున్న పథకాలు వర్తిస్తాయని ఆమె పేర్కొన్నారు. దివ్యాంగులు ఎలాంటి అపోహలకు గురికాకుండా వారికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు జారీ చేసే క్రమంలో వైద్య బందానికి అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బంది ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గోపాల్, సునీల్, సురేష్, డిపిఎం శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్లపై సంబంధిత మండలాల అధికారులతో కలెక్టర్ రాజర్షి షా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 17 మండలాల్లోని 17 గ్రామపంచాయతీలలో ఎంపికైన 2148 ఇండ్లకు మార్కింగ్ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మిగిలిన అన్ని గ్రామాల్లోని ఇండ్లకు సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియను మార్చి 7లోగా పూర్తిచేసి నివేదిక అందజేయాలన్నారు. 15 మంది అమరవీరుల కుటుంబాల అభిప్రాయాలు సేకరించగా, వారి అభిప్రాయం మేరకు ముత్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నివాస స్థలాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఆ నివాస స్థలాల అభివృద్ధి పనులకు సంబంధించిన ఎస్టిమేట్ సిద్ధం చేయాలని పీడీ హౌసింగ్‌ను ఆదేశించారు. అలాగే సొంత గ్రామాల్లో ఇల్లు కట్టుకోవాలనుకునే వారి జాబితాను ఎంపీడీఓలు సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీటి సౌకర్యం సత్వరం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి ఉన్న ఏడు క్రిటికల్ మండలాలైన ఆదిలాబాద్ రూరల్, బజార్‌హత్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, నార్నూర్, సిరికొండ, ఉట్నూర్‌లలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ జితేందర్, హౌసింగ్ పీడీ, ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

# 'అసాంఘిక శక్తులకు సహకరించొద్దు'

నవతెలంగాణ-కెరమెరి

మావోయిస్టులకు, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మండలంలోని మారుమూల ప్రాంతాలైన టోకెన్ మోవడ్, చాల్బాడి, పాటగూడ, పిట్టగూడ గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. స్థానికులతో మాట్లాడుతూ యువత, ప్రజలు అసాంఘిక శక్తులకు, మావోయిస్టులకు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారికి దూరంగా ఉండాలన్నారు. జీవితంలో ఆదర్శవంతమైన జీవితం గడపాలంటే విద్యావంతులు కావలసిన అవసరం ఉందన్నారు. ఉన్నత చదువులు చదివి తమ జీవితాలను నిలబెట్టుకోవాలన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. గంజాయి సాగు చేయకూడదని, జంతువులను వేటాడేందుకు అడవులు, పంట పొలాల్లో విద్యుత్ తీగలు అమర్చవద్దని సూచించారు. సంఘ విద్రోహ శక్తుల గురించి సమాచారం తెలిస్తే తమకు తెలియాలన్నారు. పోలీస్ శాఖ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సమస్యలుంటే స్టేషన్‌లో సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై విజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జైనూర్ : సరుకులు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ

జైనూర్ : ఎటువంటి అసాంఘిక శక్తులకు సహాయం చేయొద్దని ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. బుధవారం సిర్పూర్(యూ) మండలం రుద్దేకాస గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు. అనంతరం గ్రామస్తులకు నిత్యావసర సరుకులు, పండ్లు, పంపిణీ చేశారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ సీఐ రమేష్, సిర్పూర్(యూ) ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి




నవతెలంగాణ-జైపూర్

వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని మనమంతా గ్రూప్ సభ్యులు ఆకాంక్షించారు. బుధవారం మండలంలోని ఇందారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. చిలుకూరి శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మరామ్ బాపూజీ బాసర సరస్వతి అమ్మవారి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి పెన్నులను విద్యార్థులకు అందజేసినట్టు తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మంచి మార్కులు సాధించాలని అన్నారు. సురేష్ ఆత్మారాం బాపూజీ ప్రత్యేక పూజలు నిర్వహించి అందించిన పెన్నులను విద్యార్థులకు స్వయంగా తను అందజేయడం గొప్ప విషయమని అన్నారు. 10 సంవత్సరాల నుండి ఇలాంటి సేవ చేయడం జరుగుతుందని విద్యార్థులకు సుమారుగా మూడు లక్షల పెన్నులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మొదలు పెట్టడం జరిగిందని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మనమంతా మంచిర్యాల జిల్లా శ్రీనివాసులు వ్యవస్థాపకుడు గంద్ర శ్రీనివాసరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, బొద్దుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# విద్యార్థులు సైన్స్ పై మక్కువ పెంచుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

విద్యార్థులు చిన్నప్పటినుండి సైన్స్ పై మక్కువ పెంచుకోవాలని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవ భూషణం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్వీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సైన్స్‌తోనే సర్వం ముడిపడి ఉంటుందని అన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో ప్రగతి సాధించినప్పుడే దేశం అన్ని రంగాలలో ముందంజలో ఉంటుందన్నారు. బాల్యం నుంచే సైన్స్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కతిక ప్రదర్శనలు అందరిని అలరించాయి. ఈకార్యక్రమంలో సింగరేణి అధికారి అసిస్టెంట్



మేనేజర్ దీకొండ సాయితేజ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనూష భాను, ఎస్వీ ఇంగ్లీష్ మీడియం ప్రధానోపాధ్యాయుడు దీకొండ సంజీవ్ కుమార్, ఉపాధ్యాయులు రుక్మిణి, విజయ కుమారి, తిరుపతి, హిమబిందు, మౌనిక, మంజుల, దేవిక, లక్ష్మితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## మొదటిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం
నవతెలంగాణ-ముథోల్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మొదటి రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకున్నారు. ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 329 మంది విద్యార్థులకు 315మంది పరీక్షకు హాజరయ్యారు. 14మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎండీ మీరాజ్ మహిమూద్ తెలిపారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కేంద్రంలో 367 మంది విద్యార్థులకు 328 మంది పరీక్షకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి తెలిపారు. ఎస్ఐ సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## ఆ ఉపాధ్యాయులను విధుల నుండి తొలగించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థినులతో అసభ్యకర ప్రవర్తనతో ఉపాధ్యాయులు దిగిన ఫొటోలు వైరల్ వైరల్ అవుతున్నాయని, ఆ ఉపాధ్యాయుపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రామన్నపేట కన్వీనర్ అక్షర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం డీఈఓ ప్రణీతను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల బజార్‌హత్నూర్ మండలం మోడల్ స్కూల్ నుండి వండర్ల వెళ్లారని పేర్కొన్నారు. అక్కడ ఉపాధ్యాయులు విద్యార్థినులతో ఫొటోలు దిగారని, అవి అసభ్యకరంగా ఉన్నాయని ఆరోపించారు. దీనికి కారకులైన ఉపాధ్యాయులపై, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రధానోపాధ్యాయునిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ నిఖిల్, సాయినాథ్, సాయి, మహేష్, కార్తీక్, ఉదయ్, అరుణ్ పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి వ్యక్తి మృతి
నవతెలంగాణ-కడెం

ప్రమాదవశాత్తు గోదావరి నదిలో మునిగి చిట్యాల గొండుగూడ గ్రామానికి చెందిన పందిరి జలపతి(56) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం జలపతి పొలం పనులకు వెళ్లి సాయంత్రం సమీప గోదావరిలో ఎడ్లకు నీళ్లు తాగించి, తాను స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు గోదావరిలో నీట మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఘనంగా ఫుడ్ ఫెస్టివల్
నవతెలంగాణ-బేల

మండలంలోని బాది ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్, సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. తల్లిదండ్రుల సహకారంతో పిల్లలు తయారు చేసిన వంటకాలు నోరూరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంప్లెక్స్ హెచ్ఎం మహాలక్ష్మి హాజరై ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వంటకాల రుచులను పరిశీలించారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీఎస్.స్వామి, సీఆర్పీ వెంకన్న, ఉపాధ్యాయుల బృందం, పోషకులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను చెల్లించని దుకాణాలు సీజ్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రతి ఒక్కరూ ఆస్తి పన్ను బకాయిలు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ ఆర్ఐ అనూప్ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్లబ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో బుధవారం 26 దుకాణ సముదాయాలను సీజ్ చేశారు. 2019 నుండి సుమారు రూ.9లక్షల ఆస్తి పన్ను పెండింగ్‌లో ఉందని, రెడ్ నోటీస్ జారీ చేసినా పన్ను చెల్లించకపోవడంతో దుకాణాలను సీజ్ చేశామని పేర్కొన్నారు.

## ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి
నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలోని ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులు ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను రెండు రకాల డిక్లరేషన్లతో కలిపి ఈనెల 7న సాయంత్రం 5గంటల లోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

## ఘనంగా వీడ్కోలు సమావేశం
నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం ఆరెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని బుధవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్శ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదో తరగతి విద్యార్థులు మంచిగా చదువుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాల తరపున ఎంఈఓను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, అనిత, లాలాజీ, సుగుణ, పరమశివ, మహేష్, సత్యనారాయణ, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.